నేటి దినపత్రిక
# సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం | 22 అక్టోబర్ 2024 | పేజీలు 8

## ఘనంగా నేటి దినపత్రిక సూర్య 18వ వార్షికోత్సవ వేడుకలు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని న్యూ మిలిటరీ కాలనీలోని నేటి దినపత్రిక సూర్య జిల్లా కార్యాలయంలో సూర్య 18వ వార్షికోత్సవ వేడుకలను జిల్లా బ్రాంచ్ మేనేజర్ ఏ.రవితేజ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత 18 ఏళ్ల ప్రస్థానంలో నేటి దినపత్రిక సూర్య అనేక ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చిందన్నారు. అలాగే అట్టడుగు వర్గాల స్వరాన్ని పాలకుల దృష్టికి తీసుకుని వెళ్లి అనేక సమస్యలను పరిష్కరించిందన్నారు. 18 ఏళ్ల ప్రస్థానంలో నేటి దినపత్రిక సూర్యను ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్టులు నాగరాజు, ఉదయ్ కుమార్, సురేష్, సుమన్, కార్యాలయ ఇంఛార్జి కే.స్రవంతి పాల్గొన్నారు.

## అర్జీలన్నీ సత్వరమే పరిష్కరించాలి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలన్ని సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజలను నుండి వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించడానికి తీసుకోవాలని ఆయన సూచించారు.
ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో -మిగతా 2లో




## అమరవీరుల సేవలు అజరామరం



వివరాలు 2లో

- రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- ఘనంగా పోలీస్ అమరవీరుల దినోత్సవం



మాజీ ఏఎంసీని నాడు దేవుడు.. దేవుడు !

## నేడు ద్రోహి.. ద్రోహి

### అంటున్న మాజీ ఎమ్మెల్యే

- గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో అరాచకాలు
- కావలిలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే చేసిన కుంభకోణాలు
- వెలుగులోకి తీసుకొస్తున్నట్లు సమాచారం

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో 2012 వైసీపీని స్థాపించిన దగ్గర నుండి దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి అభిమానిగా ఉంటూ రాజకీయాల్లో చిన్నచిన్నగా ఎదుగుతున్న మాజీ ఏఎంసీ మన్నెమాల సుకుమార్‌రెడ్డి కావలి రాజకీయాల్లోకి అడుగుపెట్టి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డికి రాజకీయంగా దగ్గరయ్యారు. అలాగే 2014 అసెంబ్లీ ఎన్నికల్లో మద్యం కేసులో మాజీ ఎమ్మెల్యేపై అభియోగం వచ్చిన విష యం తెలిసిందే. అయితే ఆ నేరారోపణ -మిగతా 2లో

## క్యాన్సర్ రహిత కోవూరు నా లక్ష్యం



- 35 ఏళ్లు దాటిన ప్రతి మహిళ మూడేళ్లకో సారైనా మామోగ్రాం టెస్ట్ చేయించుకోవాలి
- తొలిలోనే ట్రీట్మెంట్ చేయిస్తే 90 శాతం క్యాన్సర్ మరణాలను అరికట్టవచ్చు
- సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ క్యాన్సర్ స్క్రీనింగ్స్‌పై అవగాహన కల్పించండి
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

క్యాన్సర్ అనగానే అదేదో చికిత్స లేని జబ్బు అన్న భయాందోళనలు వీడాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోరారు. ప్రస్తుతం ఉన్న అధునాతన వైద్య విధానాల ద్వారా తొలి దశలో గుర్తించగలిగితే క్యాన్సర్ వ్యాధికి చికిత్స ఉందన్నారు. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని కమ్యూనిటి హెల్త్ సెంటర్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్స్ చేసే పింక్ బస్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి మాట్లాడుతూ.. మన దేశంలో క్యాన్సర్ బాధితుల్లో ప్రతి ముగ్గురిలో -మిగతా 3లో

# అమరవీరుల సేవలు అజరామరం

## రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రజల రక్షణలో ప్రాణత్యాగం చేసిన మహనీయులకు నివాళు లర్పిస్తూ.. వారి కుటుంబాలకు అందరం తోడుగా ఉన్నామని తెలియజేసే మహోత్తరమైన రోజే పోలీసు అమరవీరుల దినోత్సవమని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత సంస్మరణ స్థూపం వద్ద విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులకు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పోలీసు లాంఛనాలతో ఘన నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబాలకు ప్రభుత్వం తరపున చెక్కులు అందించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ.. దేశ సరిహద్దుల్లో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశ రక్షణలో ఎందరో సైనికులు అసువులు బాస్తున్నారన్నారు. అటువంటి వారి త్యాగ నిరతిని గుర్తు చేసుకుంటూ వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని సందేశాన్ని ఇచ్చేందుకు ఇటువంటి సంస్మరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. దేశ సరిహద్దుల్లో సైన్యం నిత్యం పోరాడుతూనే ఉంటుందని, సముద్ర మట్టానికి దాదాపు 5 కిలోమీటర్ల ఎత్తున ఉన్న హిమాలయాల్లో తమ ప్రాణాలను సైతం ప్రాణంగా పెట్టి దేశాన్ని కాపాడుతున్నారన్నారు. అదేవిధంగా దేశ అంతర్గత భద్రత విషయంలో పోలీసులు నిత్య పోరాటం చేస్తున్నారని, నక్సలిజాన్ని రూపుమాపేందుకు ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియా వల్ల యువత తమ భవిష్యత్‌ను పాడు చేసుకుంటున్నారని, దీనిని సమర్థంగా ఎదుర్కొనేందుకు పోలీస్‌శాఖ వారు కృషి చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలల స్థాయిలో ఎన్సీసీలో విస్తృతంగా విద్యార్థులను చేర్చే విధంగా జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ కృషి చేయాలన్నారు. దీనివల్ల చిన్న వయసులోనే క్రమశిక్షణ, దేశభక్తి పెరిగి రక్షణ దళాలలో చేరి దేశానికి సేవ చేయాలనే స్ఫూర్తి కలుగుతుందన్నారు. అదేవిధంగా పోలీస్ సెలక్షన్స్‌లో నిలిచి, శిక్షణలో ఉద్యోగాలు త్రుటిలో తప్పిపోయిన వారికి దేవదాయ శాఖలో సెక్యూరిటీ గార్డ్స్‌గా తీసుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రేపటి సమాజానికి భద్రత కల్పించే ప్రక్రియలో ప్రాణాలను అర్పించిన వారికి నివాళి ఘటించడమే కాకుండా ఆయా కుటుంబాలను భవిష్యత్తులో కూడా ఆదుకుంటామన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల త్యాగాలకు గుర్తుగా సంస్మరణ దినోత్సవం జరుపుకుంటున్నామని, సమాజ రక్షణకై పోరాడుతున్న పోలీసుల కృషి స్ఫూర్తిదాయకమన్నారు. వారు ఎల్లప్పుడూ ప్రజల మనసుల్లో నిలిచి ఉంటారని వారి సేవలను కొనియాడారు. కలెక్టర్ ఒ.ఆనంద్ మాట్లాడుతూ.. 1959వ సంవత్సరం అక్టోబరు 21వ తేదీ జమ్మూ కాశ్మీర్‌లోని హిమాలయ పర్వత శ్రేణుల్లో సముద్ర మట్టానికి 5 కిలోమీటర్ల ఎత్తున గల భారత దేశ సరిహద్దు అయిన లడాక్ భూ భాగంలోకి చైనా దురాక్రమణకు పాల్పడిన సమయంలో అసువులు బాసిన వీర జవాన్లకు నివాళిగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. గత సంవత్సరం విధి నిర్వహణలో ప్రాణాలు వదిలిన పోలీస్ సిబ్బందికి తమ ప్రగాఢ నివాళి అర్పిస్తున్నామన్నారు. అదేవిధంగా అమరులైన వారి కుటుంబాలను ఆదుకునేందుకు, అవసరమైన సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం ఎప్పుడు సంసిద్ధంగా ఉంటుందన్నారు. జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ మాట్లాడుతూ దేశ సరిహద్దుల నుండి మన ఇంటి సరిహద్దుల వరకు అనునిత్యం కాపాడుతూ తమ ప్రాణాలను సైతం ఒడ్డి జవాన్లు, పోలీసులు పోరాడుతున్నారన్నారు. జిల్లాలో పోలీస్ సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రతి శుక్రవారం వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో గత సంవత్సరం ప్రాణాలోదిలిన 12 మంది పోలీసు వారికి నివాళి అర్పిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరఫున పరిహారం అందించామన్నారు. కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు బల్లి కళ్యాణ్ చక్రవర్తి, నెల్లూరు నగర పాలక సంస్థ మేయర్ స్రవంతి, జాయింట్ కలెక్టర్ కార్తీక్, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ, అడిషనల్ ఎస్పీ సౌజన్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## అర్జీలు అన్ని సత్వరమే పరిష్కరించాలి

*(మొదటి పేజీ తరువాయి)*

ఎక్కువ శాతం రెవెన్యూ, సర్వే, పంచాయతీ శాఖలకు సంబంధించిన దరఖాస్తులు వస్తున్నాయన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 375 అర్జీలు వివిధ సమస్యలపై వచ్చాయని కలెక్టర్ తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నెల్లూరు జిల్లా యానాదుల సంక్షేమ సంఘం ప్రతినిధులు చంద్రశేఖరపురం గురుకుల పాఠశాలలో భోజన సౌకర్యం, తాగునీటి సౌకర్యాలు సక్రమంగా లేవని కలెక్టర్‌కు తెలియజేశారు. గురుకుల పాఠశాలలో లైట్లు, ఫ్యాన్లు కూడా సక్రమంగా లేవన్నారు. గతంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌కు పలుమార్లు తెలియజేసినప్పటికీ ఫలితం లేదని, కలెక్టర్ చర్యలు తీసుకోవాలని మహిళా అధ్యక్షురాలు చెంబెటి ఉష, కల్లూరు వరలక్ష్మి, తిరువీధుల సతీష్ చంద్ర తదితరులు జిల్లా కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ.. గురుకుల పాఠశాలను తానే స్వయంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. పొంగూరి కండ్రిక గ్రామ నివాసి మాదాల పెంచలయ్య సిజేఎఫ్ పథకం కింద తన తండ్రి మాదాల పెంచలయ్యకు 4.52 సెంట్లు భూమిని ప్రభుత్వం మంజూరు చేసిందని, అప్పుడు నుండి తన స్వాధీనం ఉందని, అందులో 33 సెంట్లు భూమిని ప్రభుత్వం వారు మాదాల ధనలక్ష్మి తన భార్య పేరుతో డీకేటీ పట్టా మంజూరు చేశారన్నారు. మిగిలిన రెండు నెంబర్లకు సంబంధించి డీకేటీ పట్టాల మంజూరు చేయలేదని, రెవెన్యూ అధికారులు చుట్టూ మంజూరు కోసం తిరుగుతున్నానని తెలిపారు. తమ గ్రామానికి చెందిన మాదాల సుబ్బారావు, అతని కుమారుడు మాదాల నాగేశ్వరరావు రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి వారి పేర్లను సర్వే నెంబర్ 961లో 2.5 రెండు సెంట్లు 1బి అడంగల్‌లో నమోదు చేసుకుని ఉన్నారన్నారు. సర్వే నెంబర్ 899/2,3ఎలో మొత్తం 1.68 సెంట్లు సీజేఎఫ్‌ఎస్ భూమిని వారసత్వం కింద మాదాల సుబ్బారావు, అతని కుమారుడైన మాదాల నాగేశ్వరరావుకు రిజిస్ట్రేషన్ చేసి ఉన్నారు. ఈ విషయమై స్పందించి న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ అధికారిని విచారించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుకపాలెం గ్రామస్తులు ప్రసాదు, రమణయ్య మరికొందరు గ్రామంలో నారాయణ స్కూల్, ఎలిమెంటరీ స్కూల్, ప్రైవేట్ హాస్పిటల్ పోలేరమ్మ చెట్టు మధ్యలో బ్రాందీ షాపును ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నారని అక్కడ చిన్నపిల్లల స్కూల్ వెళ్లి రావడానికి చాలా ఇబ్బందిగా ఉంటుందని మద్యం షాప్ మద్యం పెట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కే. కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.లవన్న, జిల్లా పరిషత్ సీఇఓ మోహన్ రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖఅధికారి రామారావు, డీఆర్‌డీఏ పీడీ నాగరాజ కుమారి, డ్వామా పీడీ గంగాభవాని, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్‌నాయక్, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య, ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఏఎంసీని నాడు దేవుడు.. దేవుడు !

# నేడు ద్రోహి.. ద్రోహి.. అంటున్న మాజీ ఎమ్మెల్యే

*(మొదటి పేజీ తరువాయి)*

తనపై వేసుకొని కటకటాల పాలయ్యారు. ఈ విషయం కావలి నియోజకవర్గం ప్రజలకు విదితమే. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ఏఎంసీ మన్నెమాల సుకుమార్ రెడ్డి మాజీ ఎమ్మెల్యేకి అండగా ఉంటూ రాజకీయంలో తన చతురతను ఉపయోగించి ఓటర్లను ఆకట్టుకున్నారు. అంతేకాకుండా కావలి నియోజకవర్గంలోని మత్స్యకారుల విషయంలో తను ఎంతో అండగా ఉండి వారికి కావలసిన ప్రతి పనికి ధైర్యంగా నిలబడి వారికి రాజకీయంగా ఎన్నో పనుల్లో సహాయం చేశారు. 2019లో సంవత్సరంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కావలి నియోజకవర్గం రాజకీయ పరిస్థితులే మారిపోయాయనడంలోనూ సందేహం లేదు. ఎందుకంటే 2014 నుండి 2019 వరకు కావలి నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి గెలిచినప్పటికీ అప్పుడు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంది. అయినప్పటికీ ప్రత్యర్థుల్ని ఎదుర్కోవడంలో దీటుగా తన వ్యూహాన్ని ప్రదర్శించి రాజకీయంగా ప్రతి విషయంలోనూ ఎదురొడ్డి నిలిచింది మాజీ ఏ.ఎం.సి మన్నెమాల సుకుమార్ రెడ్డి కావడం గమనార్హం. అలాగే 2019లో రాజకీయ ఉద్దండుడుగా, ప్రజల్లో షాడో ఎమ్మెల్యేగా రాష్ట్రంలోనే ఎనలేని విధంగా ఒక పేరు తెచ్చుకున్నాడు. మన్నెమాల సుకుమార్‌రెడ్డి రాజకీయలు తనదైన శైలిలో నిర్వహిస్తూ, రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కి అండదండగా నిలుస్తూ, ప్రతి మండలంలో ప్రతి అధికారి దగ్గర గత ప్రభుత్వంలో ఇబ్బందులు పడ్డ వైసీపీ నాయకులకు కార్యకర్తలకు తన వంతుగా అందించవలసిన ఉద్యోగాలు, అధికారుల బదిలీలు, టెండర్ పనులు విషయంలో అయితేనేమి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి ఆదేశాలనుసారంగా పంచడంలో కూడా ఎక్కడ కూడా వారి మధ్య తారతమ్యాలు లేకుండా సఫలమయ్యారు. నియోజకవర్గంలో తనకంటూ ఒక పట్టు సాధించిన మన్నెమాల సుకుమార్ రెడ్డి ప్రజలకు అండగా నిలబడి ఏమైనా చేయగల సత్తా ఉందని కార్యకర్తల్లో ఒక ధైర్యము ఒక భరోసాన్ని నింపాడు. 2014, 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, ఎంపీపీల ఎన్నికల్లో కూడా మన్నెమాల సకుమార్‌రెడ్డి తన సొంత నిధులతో ప్రత్యర్థులను దీటుగా ఎదుర్కొని విజయం సాధించడంలో 100 శాతం సక్సెస్ అయ్యారు. 2019లో కావలి విజయం రాష్ట్రంలో సంచలనంగా మారింది. అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే మాజీ ఏఎంసీని పిలిపించి వారి మీద ప్రశంసలు కురిపించినట్లు మనం చూశాం. కానీ 2023 ఎన్నికలకు ముందు మాజీ ఎమ్మెల్యే, మాజీ ఏఎంసీకి మధ్య ఏమి జరిగిందో ఏమో.. తెలియదు కానీ, ఒకరిపై ఒకరికి మనస్పర్థలు రావడం.. ఒకరిపై ఒకరు అధిష్టానానికి ఫిర్యాదు చేసుకోవడం జరిగింది. మాజీ ఎమ్మెల్యేపై మాజీ ఏఎంసీ అసంతృప్తి, ఆగ్రహంతో ఉన్నారనడంలో సందేహం లేదు. ఇన్ని సంవత్సరాలు కుటుంబాన్ని వదులుకొని, మాజీ ఎమ్మెల్యేకు తోడుగా ఉండి, పార్టీకి కష్టపడి పనిచేసి కార్యకర్తలను, నాయకుల్ని కాపాడుకుంటూ.. ప్రత్యర్థులను దీటుగా ఎదుర్కొనే విషయంలో వెనుకాడకుండా తను ఏమైనప్పటికీ కూడా పార్టీలోనే ఉండాలనే ఉద్దేశంతో ఇంత సర్వీస్ చేస్తే.. నామీద అనేకమైన నిందలు, ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసం అని మాజీ ఏఎంసీ మన్నెమాల సుకుమార్‌రెడ్డి కలత, ఆవేదన చెందుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. అంతేకాకుండా మాజీ ఎమ్మెల్యేపై 2019-2024లో కావలి నియోజకవర్గంలో జరిగిన అవినీతి, రియల్ ఎస్టేట్ వ్యాపారుల దగ్గర ఎకరాకు లక్షల్లో వసూలు చేసి కోట్లు సొమ్మును సొంతం చేసుకున్నారని అంటున్నారు. అలాగే అధికారులు దగ్గర, మద్యం సిండికేట్లను ఇంకా ప్రభుత్వ భూములు వాటి ఆక్రమణలోనూ, జగనన్న లేఔట్‌లో జరిగిన అక్రమాలు త్వరలో బయట పెట్టనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఎప్పుడో 12 సంవత్సరాల క్రితం జరిగిన అక్రమ లావాదేవీల విషయంపై నా మీద ఒక మహిళ చేత ఫిర్యాదు చేయించడం ఎంత దిగజారుడుతనానికి దారి తీశారో ఆలోచించాలని మాజీ ఎమ్మెల్యే గూడు పుటానీలు గురించి మాజీ ఏఎంసీ ఆవేదన వ్యక్తపరిచారు. కాబట్టి ఎవరు ఎప్పుడు ఎలా రాజకీయాల్లో ఉంటారో తెలియదు.

తాను ఉన్నంతకాలం ప్రజలకు సేవ చేయాలే తప్ప ప్రజలను దోచుకోవడం అనేది తన మనస్తత్వం కాదు, రాజకీయంగా ప్రజలకు సహాయం చేసిన వారిని నేడు ద్రోహిగా ప్రజలకు చూపించడం సబబు కాదని మాజీ ఏఎంసీ తన ఆవేదనను సహచరుల వద్ద వ్యక్తపరుస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ప్రస్తుత పరిస్థితులు బట్టి ఈరోజు మన్నెమాల సుకుమార్ రెడ్డికి నియోజకవర్గంలో ప్రతి మండలంలో తనకంటూ ఒక క్యాడర్‌ను సంపాదించుకోవడమనేది జగమెరిగిన సత్యం. ఉదాహరణకు ఇటీవల కాలంలో తను మీద ఆరోపణ చేసిన మహిళకు ప్రతిగా జరిగిన ప్రెస్‌మీట్ రోజు తనతో సర్పంచులు, ఎంపీటీసీలు, మత్స్యకారులు అధిక సంఖ్యలో పాత్రికేయల సమావేశంలో పాల్గొనడం గమనించదగ్గ విషయం.

# అటవీ భూముల ఆక్రమణపై అధికారుల విచారణ



**రాపూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని జోరేపల్లి అటవీ భూముల ఆక్రమణపై 'సూర్య' దిన పత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన జిల్లా ఫారెస్ట్ అధికారి షేక్ మహబూబ్ బాషా ఆదేశాలతో అటవీ రేంజర్ అధికారి తన సిబ్బందితో కలిసి సోమవారం విచారణ చేపట్టారు. అటవీ భూముల రికార్డులను, మ్యాప్‌ల సహాయంతో ఎంత మేర ఆక్రమణకు గురైందన్న విషయాలను పరిశీలించారు. ఆక్రమణకు పాల్పడ్డ ముగ్గురు వ్యక్తులకు మంగళవారం జిల్లా అటవీ అధికారి కార్యాలయంలో విచారణకు హాజరు కావాల్సిందిగా ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన 'మేజర్‌న్యూస్'కు అటవీ భూములను ఎవరు ఆక్రమించిన వాళ్ళు ఎంత పెద్ద వారైనా ఉపేక్షించేది లేదని చెప్పారు. ఆయన వెంట ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌లు శ్రీనివాసులు, లోకేష్, బీట్ ఆఫీసర్‌లు శ్రావణ్ కుమార్, మహేష్, విజయకుమార్‌లు ఉన్నారు.

# ఘనంగా పోలీస్ అమరవీరుల దినోత్సవం



పోలీస్ అమరవీరుల దినోత్సవం ర్యాలీ

**కావలి, మేజర్‌న్యూస్ :** పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా కావలి పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్ నుండి ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ వరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వన్ టౌన్ సిఐ ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ.. పోలీసులు విధి నిర్వహణలో ఎన్నో జాగ్రత్తలు పాటిస్తూ, ఎంతో ధైర్య సాహసాలతో పోరాడి అసువులు బాసిన అమర వీరుల త్యాగాలను మరువకూడదన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21వ తేదీన పోలీస్ అమరవీరులను దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. పోలీస్ అమర వీరుల వారోత్సవాల భాగంగా అక్టోబర్ 21వ తేదీ నుండి 31వ తేదీ వరకు రకరకాల పద్ధతిలో కార్యక్రమాలు నిర్వహించి ఈ వారోత్సవాల్ని విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ వారోత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు గా ఉండి పోలీస్ శాఖ ప్రతిష్టను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టూటౌన్ సిఐ శ్రీనివాసరావు, వన్ టౌన్, టూటౌన్, రూరల్ ఎస్సైలు, కానిస్టేబుళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# యువతిని మోసగించిన వ్యక్తి అరెస్ట్

**రాపూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని చెర్లోపల్లి గ్రామానికి చెందిన యువతిని అదే గ్రామానికి చెందిన శ్రీహరి అనే వ్యక్తి పెళ్లి చేసుకుంటానని నమ్మించి శుభలేఖలు పంచిన తరువాత మొహం చాటేయడంతో ఆ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన రాపూరు ఎస్ఐ వెంకటరాజేష్ మోసగించిన శ్రీహరి అనే యువకుడిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. మహిళలను మోసగించిన వారి పట్ల, అసభ్యకరంగా ప్రవర్తించిన వారిని కఠినంగా శిక్షిస్తామని ఆయన హెచ్చరించారు.

# క్యాన్సర్ రహిత కోవూరు నా లక్ష్యం : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

*(మొదటి పేజీ తరువాయి)*




ఇద్దరు వ్యాధి ముదిరిన తరవాతే డాక్టర్లను సంప్రదిస్తున్నారని క్యాన్సర్ అని నిర్ధారించి మెరుగైన చికిత్స అందించే లోపే జరగాల్సిన నష్టం జరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అవగాహన లేకపోవడం, నిరక్షరాస్యత, భయం, వివిధ రకాల అపోహల వల్లే క్యాన్సర్ నిర్ధారణ ఆలస్యం అవుతోందన్నారు. తొలి దశలోనే చికిత్స చేయడం ద్వారా 90 శాతం క్యాన్సర్ మరణాలను అరికట్టవచ్చన్నారు. 35 ఏళ్లు దాటిన ప్రతి మహిళ మూడేళ్లకు ఒక సారైనా మామోగ్రాం పరీక్ష చేయించుకోవాలని కోరారు. క్యాన్సర్ రహిత కోవూరుగా మార్చాలనే సంకల్పంతో సెప్టెంబర్ 10న ఇందుకూరు పేట మండల కేంద్రంలో క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలు ప్రారంభించామన్నారు. 600 మంది పరీక్షలు చేయించుకోగా 97 మందిని అనుమానితులుగా గుర్తించి తదుపరి వైద్య సేవలకై తిరుపతిలోని స్విమ్స్ హాస్పిటల్‌కు తరలించామన్నారు. కొడవలూరు మండలంలో 1017 మంది క్యాన్సర్ స్క్రీనింగ్స్ చేయించు కోగా 150 పాజిటివ్ కేసులు వచ్చాయని కోవూరు మండలంలో 1200 మందికి గాను 127 మంది క్యాన్సర్ అనుమానితులుగా తేలార న్నారు. వీరిలో చాలా మంది తిరుపతిలోని స్విమ్స్ హాస్పిటల్‌లోను మరికొందరు స్థానికంగా వైద్యసేవలు చేయించుకుంటున్నారన్నారు. అవసరమైతే టీటీడీ ఆధ్వర్యంలోని ప్రాణదానం ట్రస్ట్ ద్వారా ఉచితంగా సర్జరీ కూడా చేయించు కోవచ్చన్నారు. తొలుత ఇందుకూరు పేటలో క్యాన్సర్ స్క్రీనింగ్స్‌కు కేవలం 600 మంది మాత్రమే హాజరైతే కోవూరు, కొడవలూరు మండలాలలో ప్రజలలో అవగాహన పెరిగి పరీక్షలు చేయించుకున్న వారి సంఖ్య పెరిగిందన్నారు. 35 ఏళ్ళు దాటిన మహిళలు ఈ పింక్‌బస్ ద్వారా అందించే ఉచిత క్యాన్సర్ పరిక్షలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు అవగాహన కల్పించడంలో స్వచ్ఛంద సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, పాత్రికేయ సోదరులు సామాజిక బాధ్యతగా భావించి విపిఆర్ ఫౌండేషన్ ద్వారా అందించే ఉచిత క్యాన్సర్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బుచ్చి సిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ మనోజ్‌కుమార్, డాక్టర్ పద్మజ, మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, మున్సిపల్ కమీషనర్ చంద్రశేఖర్ రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీహరి, స్థానిక కౌన్సిలర్లు ప్రత్యూష, నస్రీన్ ఖాన్, బుచ్చిరెడ్డిపాళెం టీడీపీ అర్బన్, రూరల్ మండల అధ్యక్షులు ఎంవీ శేషయ్య, బత్తుల హరికృష్ణ, టీడీపీ నాయకులు ఏటూరి శివరామ కృష్ణా రెడ్డి, నెల్లూరు ప్రభాకర్ రెడ్డి, హరనాథ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## అమర కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో 28వ వార్డు వైసీపీ ఇన్చార్జ్ అమర శ్రీనివాస్ వారి బాబాయ్, అరుణోదయ క్లాత్ మార్కెట్ వ్యవస్థాపకులు ఒకరైన పత్తులు అమరా వెంకటేశ్వర్లు ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న కావలి నియోజకవర్గం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి సోమవారం వారి గృహానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మాజీ ఎమ్మెల్యేతోపాటు వైసీపీ పట్టణ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## సీఎం సహాయ నిధి కింద చెక్కులు పంపిణీ



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి నియోజకవర్గంలో పేదవారు అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ వైద్యశాలలో చికిత్స తీసుకుంటున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద చెక్కులు మంజూరయ్యాయని సోమవారం కావలి ఎమ్మెల్యే పాత్రికేయుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 120 మందికి గాను 42 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద 13.52 లక్షలు మంజూరైందని, లబ్ధిదారులకు ఆ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు అక్రమిస్తే కఠిన చర్యలు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలో ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దారు ఎం.సుభద్ర హెచ్చరించారు. సోమవారం మండలంలోని ఆర్లపడియ పంచాయతీలో సర్వేనెంబర్లు 46లో 16.19, 47లో 13.95 ఎకరాల భూమిని ట్రాక్టర్లతో చదును చేసి అక్రమించేందుకు యత్నిసు న్నారని గ్రామస్తులు సమాచారం అందజేశారు. దీంతో స్పందించిన ఆమె వెంటనే సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని భూములను పరిశీలించారు. ప్రభుత్వ భూములు అక్రమించడం నేరమని, ఎవరైనా భూములు అక్రమిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. అనంతరం ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో ఆఐ సురేంద్ర, వీఆర్వో మస్తాన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జైకా నిధులతో చెరువులకు మరమ్మత్తులు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** జపాన్ ఇంటర్నేషనల్ కో–ఆపరేటివ్ ఏజెన్సీ (జైకా) నిధులతో ఉదయగిరి సబ్ డివిజన్లోని పలు గ్రామాల చెరువులకు మరమ్మత్తులు చేపడుతున్నట్లు జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి పేర్కొన్నారు. ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. ఉదయగిరి చిన్న, పెద్ద చెరువులను రూ.48 లక్షలు, గువ్వాడి రూ.23, లక్షలు ఇస్కపల్లి రూ.27, లక్షలు కృష్ణంపల్లి రూ.32 లక్షలు, లింగంనేనిపల్లి రూ.51 లక్షలతో మరమత్తులు చేపట్టనున్నామన్నారు. ప్రధానంగా తూములు, అలుగులు, కట్టలు మరమ్మత్తులు, జంగిల్ క్లియరెన్స్ చేపట్టడం జరుగుతుందన్నారు. ఇప్పటికే పలు చెరువులకు సంబంధించి పనులు కొనసాగుతున్నాయన్నారు.

## కళాశాలలో మౌలిక వసతులు కల్పనకు చర్యలు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక ఆల్తూరి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. సోమవారం కళాశాలను పరిశీలించిన ఆయనకు ప్రిన్సిపాల్ కిరణ్ నిలిచిన నాడు–నేడు పనులు, తాగునీరు, తరగతి గదుల్లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు తదితర సమస్యలను వివరించారు. అలాగే ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరణలో భాగంగా 114 జీవోను అమలు చేయాలని అధ్యాపకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ బాబు దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# చంద్రబాబు పేదల పక్షపాతి : ఎమ్మెల్యే కాకర్ల సురేష్

## - రూ.1.27కోట్ల నిధులతో సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన



**సీతారామపురం, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదల పక్షపాతి అని ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సోమవారం నాడు సీతారాంపురం మండలంలో జరిగిన పల్లె పండుగ కార్యక్రమంకి విచ్చేసిన కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఖాళీ ఖజానాతో అధికారం చేపట్టి నాలుగు నెలలలోనే సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయగల సమర్థత ఒక్క ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే ఉందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుండుపల్లి ఎస్టీ కాలనీ, సీతారామపురం రజక కాలనీ, బసినేనిపల్లి, ఏసీ నగర్, ఎస్ఆర్ నగర్, గ్రామాలలో సీసీ రోడ్ల ప్రారంభోత్సవానికి విచ్చేసిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కి టీడీపీ కార్యకర్తలు కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి విషయంలో ఐదేళ్ల వెనుక బడిందన్నారు. అభివృద్ధి లేక అస్తవ్యస్తమైన గ్రామీణాభివృద్ధిని గాడిలో పెట్టి పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాలకు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్న నినాదంతో చంద్రబాబు నాయుడు గ్రామీణాభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించారన్నారు. ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎప్పుడు ముందుంటానని తెలిపారు. రానున్న ఐదు సంవత్సరాలలో సీతారాంపురం మండలంలో మట్టి రోడ్డు లేకుండా చేస్తానని తెలిపారు. ఈ ప్రాంతంలో వలసలు నివారణకు తాను శక్తి వంచన లేకుండా పని చేస్తానని తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని 8మండలాలలో కల్లా సీతారాంపురం మండలానికి ఎక్కువ నిధులు కేటాయించానని తెలిపారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలలో సీసీ రోడ్లు, లాంటి మౌలిక సదుపాయాల కోసం ఒక కోటి 27 లక్షల రూపాయలు కేటాయించడం స్వాగతించదగ్గ పరిణామమని మండల నాయకులు తెలిపారు. తాను ప్రజాసేవ చేసేందుకే రాజకీయాలలోకి వచ్చానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. చంద్రబాబు అమలు చేయనున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రశంసించారు. రానున్న దీపావళి సందర్భంగా మహిళలకు ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీతో పాటు రానున్న సంక్రాతి సందర్భంగా పేదలకు ఉచితంగా ఇళ్ల స్థలాలు అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కమిటీ మెంబర్ భోగినేని కాశీరావ్‌కి, తహసీల్దార్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో భాస్కర్, ఎస్ఐ శివ కృష్ణారెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, సీతారాంపురం సర్పంచ్ కొడవటి కంటి భాగ్యకుమారి, పోలంగారిపల్లి సర్పంచ్ ముత్తురు వెంకటసుబ్బయ్య, సీతారామపురం బిట్టు ఎంపిటిసి తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ వెంకటపతి, గౌరవ అధ్యక్షులు మొత్తం శెట్టి చెన్నకేశవులు, వెంగళ శెట్టి వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ అధ్యక్షులు జాషువా, యువత అధ్యక్షులు ఎడమ ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, సీతారామపురం పార్టీ అధ్యక్షులు దేవర వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షులు సోమన బొయిన రాజశేఖర్, మండల బీసీ సెల్ అధ్యక్షులు తురక వెంకటేశ్వర్లు, గాజులపల్లి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్‌కు తెలియజేయండి

## - కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక సమస్యలను కమాండ్ కంట్రోల్ విభాగంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్‌కి ఫోన్ ద్వారా తెలియజేస్తే తక్షణమే స్పందించి ఫిర్యాదును పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిషనర్ సూర్యతేజ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ సూర్యతేజ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ అంశాలపై ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని, వాటన్నింటికీ నిర్ణీత సమయంలోగా పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అందుకున్న వినతులు పునరావృతం కాకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో శాశ్వత పరిష్కారం అందించాలని కమిషనర్ సంబంధిత సెక్షన్ అధికారులకు కోరారు. విభాగాల వారీగా రెవెన్యూ-1, ఇంజనీరింగ్-5, టౌన్ ప్లానింగ్-7, పబ్లిక్ హెల్త్-1, హౌసింగ్-4, మొత్తం 18 ఫిర్యాదులను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్నారు. అనంతరం విలేకరులతో కమిషనర్ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులు తమ సమస్యలను 9494018118 నెంబరుకు వాట్సప్ ద్వారా లేదా 0861-2356777, 0861-2316777 హెల్ప్‌లైన్ నెంబర్లకు ఉదయం 6:00 నుంచి సాయంత్రం 6:00 గంటల లోపు తెలియజేయాలని కోరారు. నిర్దేశించిన ఫోన్ నెంబర్లు ప్రజలకు అందుబాటులో ఉండేలా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, కూడళ్లు, సచివాలయ భవనాల్లో ప్రదర్శించి హెల్ప్‌లైన్ విభాగంపై విస్తృత ప్రచారం కల్పిస్తున్నామని కమిషనర్ తెలిపారు. అందుకున్న ఫిర్యాదులను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సంబంధిత అధికారులకు తెలియచేసి తక్షణమే సదరు సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శర్మద, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ ఎస్.ఈ రామ్ మోహన్ రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, సిటీ ప్లానర్ కృష్ణ కిషోర్, మేనేజర్ ఇనాయతుల్లా ఇతర అన్ని విభాగాల అధికారులు, సూపరింటెండెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా అమరవీరుల సంస్కరణ దినోత్సవం



**సీతారామపురం, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన సీతారామపురంలో ఎస్ఐ శివకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నాడు పోలీసుల సంస్కరణ దినోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. అమరులైన పోలీసులకు నివాళులర్పిస్తూ వారి చిత్రపటాలకు పూలమాల వేశారు. అనంతరం పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్లో మానవహారం ఏర్పాటు చేసి అమరవీరుల త్యాగాలను వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రాణాలను సైతం లెక్కచేయక ప్రజల కోసం మేము ఉన్నాము అంటూ తమ ప్రాణాలు సైతం త్యాగాలు చేసి ఎంతోమంది ప్రాణాలను కోల్పోతున్నారని ఆయన గుర్తు చేశారు. ఎందరో పోలీసులు తమ కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ దేశం కోసం తమ ప్రాణాలను అర్పిస్తున్నారని వారి సేవలు మరువలేనివి తెలిపారు. వారు చేసిన సేవలను ప్రతి సంవత్సరం గుర్తు చేసుకుంటూ భావితరాలకు వారు స్ఫూర్తిగా నిలుస్తారని తెలిపారు.అనంతరం గ్రామంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివ కృష్ణారెడ్డి, హై స్కూల్ విద్యార్థులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మా పిల్లలకు మంచి వసతులు కల్పించండి..



**నెల్లూరు/నవాబుపేట, మేజర్‌న్యూస్ :** చంద్రశేఖరపురం గురుకుల పాఠశాలలో లైట్లు లేవు, ఫ్యాన్లు లేవు, నీళ్లు లేవు భోజనమూ సరిగా లేదు.. గిరిజన పిల్లలకు న్యాయం చేయండి అంటూ జిల్లా కలెక్టర్‌కి యానాదుల సంక్షేమ సంఘం వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో యానాదుల సంక్షేమ సంఘం కలెక్టర్ ఆనంద్‌ని కలిసి కొండవలూరు మండలంలోని చంద్రశేఖర పురంలోని ఈఎంఆర్ఎస్ స్కూల్ లోని సమస్యలను కలెక్టర్‌కి వివరించారు. అక్కడ విద్యార్థినీ విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, హాస్టల్ గదిలో లైట్ లేవు, ఫ్యాన్లు లేవు, మరుగు దొడ్లలో నీళ్లు లేవు.. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్, ఇతర అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదు.. మీరైనా స్పందించి గిరిజన బిడ్డలకు న్యాయం చేయండి అంటూ.. కలెక్టర్‌ని కోరడమైనది. తానే స్వయంగా గురుకుల పాఠశాలను సందర్శించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష, నగర అధ్యక్షురాలు కల్లూరు వరలక్ష్మి, రాష్ట్ర నాయకులు తిరువీధి సతీష్ చంద్ర, మహిళా నాయకురాలు మానికల నాగమణి పలువురు విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ ద్వారా ఉదారంగా ఆర్థికసాయం

## 26మందికి 16.58 లక్షల చెక్కులు పంపిణీ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఉదారంగా ఆర్థికసాయం అందించి అండగా ఉంటున్నామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు నియోజక వర్గ పరిధిలోని 26 మంది లబ్ధిదారులకు రూ. 16.55 లక్షలు విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు ఆసరాగా, ఇంటి పెద్దగా వుంటూ పెద్దన్నగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం చేస్తున్న మానవతావాది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని మంత్రి కొనియాడారు. బాధితులందరి తరపున ముఖ్యమంత్రికి మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్‌డిఏ ప్రభుత్వంలో ఏ ఒక్కరూ కూడా ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

# విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని దుర్గంపల్లి గ్రామానికి చెందిన రాజేశ్వరి తన కుమారుడు దశరథ కనిపించడం లేదని సోమవారం ఎస్ఐ కర్నాటి ఇంద్ర సేనారెడ్డికి ఫిర్యాదు చేసింది. వివరాల మేరకు.. ఉదయగిరిలో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న రాజేశ్వరి ఆదివారం మధ్యాహ్నం భోజనానికి వెళుతూ కుమారున్ని దుకాణంలో ఉంచి వెళ్లింది. తిరిగి దుకాణానికి వచ్చిన రాజేశ్వరి కుమారుడు లేకపోవడంతో పాటు దుకాణంలో కూరగాయలకు ఇవ్వాల్సిన రూ. 9వేల నగదు కూడా కనిపించలేదన్నారు. అప్పటి నుంచి బంధ వులు, స్నేహితులను విచారించినా ఫలితం లేదు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు దర్యాప్తు చేస్తున్నారు.

# అర్ధరాత్రి జరుపుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

## ఎమ్మెల్సీ పార్వతి రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరులో 13వ డివిజన్ హెచ్‌పి గోడౌన్ సమీపంలోని నాలుగు పార్కుల సెంటర్ వద్ద ప్రజలకు ఉపయోగ పడే పార్కు ముందు అడ్డంగా అర్ధరాత్రి పూట జరుగుతున్న అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. వైసీపీ నాయకులు 13వ డివిజన్ కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జునతో కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మున్సిపల్ కమిషనర్‌కు అక్రమ నిర్మాణ పనులను తక్షణమే అరికట్టాలని.. పార్కు స్థలాన్ని సంరక్షించే విధంగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతూ లేఖను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ ప్రజలకు ఇంతవరకు ఒక్క హామీ కూడా నెరవేర్చకపోవడం సిగ్గు చేటు అన్నారు. నెల్లూరు నగరానికి మంత్రి నారాయణ ఇచ్చిన హామీలు కూడా.. పక్కన పెట్టేసారని విమర్శించారు. అదేవిధంగా తెలుగు దేశం పార్టీ నేతలు నెల్లూరులో ప్రజలకు ఉపయోగపడే స్థలాల ముందు అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారని తెలియజేశారు. ప్రజలకు ఆహ్లాదం పంచే పార్కుల్లో వారు ఇష్టా రీతిలో అర్ధరాత్రి సమయంలో అక్రమ నిర్మాణాలు చేపట్టి పార్కుల ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అక్రమ నిర్మాణం జరుగుతున్న విషయాన్ని ఆదివారం రోజునే తాము మునిసిపల్ కమిషనర్ దృష్టికి తీసుకురావడం జరిగిందని, కమిషనర్ సూర్యతేజ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ అక్కడ.. రాత్రివేళల దౌర్జన్యంగా నిర్మాణం సాగిస్తున్నారని తెలిపారు. అందుకే ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నేరుగా కమిషనర్‌ని కలిసి అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. మెమోరాండం అందజేసి ఫిర్యాదు చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ అక్రమ నిర్మాణాలపై కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టకపోతే.. భవిష్యత్తులో తామే ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నీలి రాఘవరావు, వైసిపి నాయకులు అబ్దుల్ మస్తాన్, మాభాష, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంచాయతీ సమావేశం నుంచి వార్డు సభ్యులు నిష్క్రమణ



- సర్పంచ్ రాక ఆలస్యం కావడంతో వార్డు సభ్యులు ఆగ్రహం
- టెండర్లు ఆమోదం కొరకు జరిపిన సమావేశం వాయిదా
- మరోసారి జరపాలంటూ సర్పంచ్ ఆదేశాలు

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** పంచాయతీ సమావేశం నుంచి ఆరు మంది వార్డు సభ్యులు నిష్క్రమణ చేశారు. ముత్తుకూరు గ్రామపంచాయతీలో వివిధ పనులు నిర్వహించేందుకు పోస్టులు భర్తీ నిమిత్తం టెండర్లు ఆమోదం కొరకు పంచాయతీ పాలకవర్గం పంచాయతీ సమావేశాన్ని సోమవారం నిర్వహించింది. ఈ మేరకు ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కావాలని అజెండాలో రూపొందించారు. ఆరు మంది వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి జగదీష్, సిబ్బంది సకాలంలో హాజరు కావడం జరిగింది. అర్ధగంట ఆలస్యంగా సర్పంచి రావడంతో అంతకుముందే వచ్చి ఉన్న వార్డు సభ్యులు ఈ విషయంపై అసహనం వ్యక్తం చేస్తూ సమావేశం నుంచి వెళ్ళిపోతున్నామని బహిష్కరించారు. కాసేపు పంచాయతీ కార్యదర్శితో మాట్లాడిన వచ్చిన ఆరు మంది వార్డు సభ్యులు వెళ్ళిపోతూ ఉండడంతో పంచాయతీ కార్యదర్శి సముదాయించారు. చెప్పిన సమయం ప్రకారం మేము వచ్చామని మరి సర్పంచ్ రాకపోతే మేమెందుకు ఉండాలని వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శితో వాగ్వాదం చేశారు. సర్పంచ్ వస్తారని కార్యదర్శి చెప్పగా మేమెందుకు ఉంటాం మాకేమీ పని లేదా అంటూ అసహనం చూపారు. ఇది ఎక్కడ సమస్య అంటూ పంచాయతీ కార్యదర్శి తల పట్టుకున్నారు. వార్డు సభ్యులు వెళ్లిపోయిన తర్వాత సర్పంచ్ వచ్చారు. సర్పంచ్‌తో పాటు మరో వార్డు సభ్యులుమణి కార్యాలయంలో ఉన్నారు. వార్డు సభ్యులు సమావేశం నుంచి ఎందుకు వెళ్లిపోయారని సర్పంచి పంచాయతీ కార్యదర్శిని అడిగినారు. సర్పంచి రావడం ఆలస్యం అయిందని మేము వచ్చి అర్ధ గంట అవుతుంది అని ఇదేమి పద్ధతి అంటూ ప్రశ్నిస్తూ వెళ్లారని కార్యదర్శి సర్పంచికి తెలియజేశారు. చిన్న పని వల్ల ఆలస్యం అయిందని సర్పంచి తెలిపారు. మరోసారి సమావేశం ఏర్పాటు చేసి టెండర్లు ఆమోదించాలని సర్పంచి పంచాయతీ కార్యదర్శి ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాళ్లపాడు మంచినీటి శుద్ధి పై త్వరితగతిన చర్యలు తీసుకోవాలి

- చేపల పెంపకం పై పర్యవేక్షణ చేయాలి
- కందుకూరు అభివృద్ధి కమిటీ చైర్మన్ దివి శివరాం
- సాగు, తాగు నీటికి ఇబ్బంది లేకుండా చూస్తాం
- సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కందుకూరు నియోజకవర్గానికి సాగు, తాగునీటి సరఫరాకు తలమానికమైన రాళ్లపాడు ప్రాజెక్టు నుండి నూటముప్పై గ్రామాలకు పైగా మంచినీటి సరఫరా జరుగుతుందని మంచినీటిని శుద్ధి చేయడంలో సరైన మార్గదర్శకాలు చేపట్టడం లేదు శుద్ధి కార్యక్రమం త్వరితగతిన చేపట్టి గ్రామాలకు సురక్షిత నీటిని అందించి ప్రజల ఆరోగ్య పరిరక్షణ చేయాలని కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ దివి శివరాం సోమవారం సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజను కలిసి వివరించారు. ఈమధ్య రాళ్లపాడు ప్రాజెక్టు సందర్శించినప్పుడు ప్రాజెక్టులో నీటిని, శుద్ధి ట్యాంకర్ దగ్గర నీటిని, సరఫరా కొళాయి దగ్గర నీటిని సేకరించి టెస్టింగ్‌కు పంపించడం జరిగినది. తాగునీటికి ఉండవలసిన క్వాలిటీ లేనందున ఆ రిపోర్ట్‌ను సబ్ కలెక్టర్‌కు అందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరడం జరిగినది. అదేవిధంగా ప్రభుత్వం కూడా నీటి నాణ్యతను పరిశీలించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాళ్లపాడు ప్రాజెక్టులో చేపలు సహజ సిద్ధంగా పెంచడం కాకుండా వ్యర్థాలను తీసుకువచ్చి చేపలకు ఫీడింగ్ ఇవ్వటం ద్వారా నీరు కలుషితమై అనేక విధాల సమస్యలు స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్నారని వివరించారు. చేపల పెంపకం పైన కూడా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ల్యాబ్ రిపోర్ట్స్ సబ్ కలెక్టర్‌కు అందించిన వారిలో అభివృద్ధి మండలి ఉపాధ్యక్షులు షేక్ రఫీ, ట్రెజరర్ కాకుమాని మాధవరావు, గౌరవ సభ్యులు పోకూరి మాల కొండయ్య, తోకల వెంకటేశ్వర్లు, చింతలబోయిన నరేష్, గాండ్ల హరి ప్రసాదు, షేక్ జిలాని, అధికార ప్రతినిధి ముప్పవరపు కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రాజెక్టు పర్యవేక్షణకు అన్ని విధాలుగా తగిన చర్యలు తీసుకుని సాగు, తాగునీటి సరఫరాకు ఎటువంటి అవాంతరాలు లేకుండా చేస్తామని తెలిపారు.

## దగ్ధమైన షాపును పరిశీలించిన నాయకులు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కందుకూరు పట్టణంలోని ముస్లిం సోదరుడు షేక్ రఫీ టైర్ల షాపు ప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమైన సంగతి తెలుసుకొని కందుకూరు నియోజకవర్గ ఐక్యవేదిక అధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో పరిశీలించారు. బాధితున్ని పరామర్శించి మనోధైర్యంతో ఉండాలని, తిరిగి వ్యాపార రంగంలో పురోభివృద్ధి సాధించుటకు కృషి చేయాలని, అందులకు గాను ముస్లిం ఐక్యవేదిక తన పరిధిలో తగిన సహాయ సహకారాలు అందిస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు షేక్ ఫజుల్లా, మునీర్ బాయ్, ఎస్ఎం బాష తదితరులు పాల్గొన్నారు.

## ఆనం సురేష్‌ను పరామర్శించిన చేజర్ల



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ చేనేత విభాగం అధ్యక్షులు ఆనం సురేష్ ఇటీవల అనారోగ్యానికి గురై, నారాయణ హాస్పిటల్‌లో చికిత్స పొంది, నెల్లూరు నవాబుపేట లోని వారి నివాసంలో విశ్రాంతి తీసుకుంటుండగా, వారిని సోమవారం తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. వీరితో పాటు రాష్ట్ర టీడీపీ బీసీ సాధికారిక సమితి కన్వీనర్ పిఎల్ రావు, ఐ-టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు షేక్ రసూల్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

## బోగోలు తహసిల్దార్ కార్యాలయం తనిఖీ



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు తహసిల్దార్ కార్యాలయాన్ని సోమవారం కావలి ఆర్డీవో ఆకస్మిక తనిఖీ చేశారు. ఆఫీసు సిబ్బందికి, గ్రామ రెవెన్యూ అధికారులకు పిజిఆర్ఎస్ అర్జీలు పరిష్కారంలో, ప్రజల నుండి వచ్చే అనేక సమస్యల పరిష్కారంలో అదేవిధంగా తెలుగు రెవెన్యూ సదస్సులకు ఏ విధంగా పరిష్కారం చూపవలెను చర్చించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆఫీసు రికార్డులు, కంప్యూటర్ రూమును పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు.

## ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేటలో ఎస్ఐ ఏ.సైదులు ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్ఐ ఏ.సైదులు ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ నుండి బస్టాండ్ మీదుగా నగర కానా సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు బస్టాండ్ సెంటర్లో మానవహారంగా ఏర్పాటు చేశారు పోలీస్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కలువాయిలో అమరవీరుల సంస్కరణ దినోత్సవం

**కలువాయి, మేజర్‌న్యూస్ :** విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయక మావోయిస్టుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ అనకర్ల కేశవులు సేవలు నిలిచిపోతాయని రాపూర్ సర్కిల్ ఇన్స్‌ఫెక్టర్ విజయ్ కృష్ణ తెలిపారు, పోలీసుల అమరవీరుల సంస్కరణ దినోత్సవ సందర్భంగా కలువాయి మండల కేంద్రంలోని పోలీసులు అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రాణాలను సైతం లెక్కచేయక ప్రజల కోసం మేము ఉన్నామంటూ తమ ప్రాణాలు సైతం త్యాగాలు చేసి ఎంతోమంది ప్రాణాలను కోల్పోతున్నారని ఆయన తెలిపారు. కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ దేశం కోసం తమ ప్రాణాలను అర్పిప్పిస్తున్నారని వారి సేవలు ఎనలేని తెలిపారు. వారు చేసిన సేవలను ప్రతి సంవత్సరం గుర్తు చేసుకుంటూ భావితరాలకు వారు స్ఫూర్తిగా నిలుస్తారని తెలిపారు. అనంతరం గ్రామంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.



ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుమన్, మండల విద్య శాఖ అధికారి శేషగిరి రావు, హై స్కూల్ హెచ్ఎం అబ్బాస్ అలీ, అనకర్ల కేశవులు తల్లిదండ్రులు, నవభారతి, హై స్కూల్ విద్యార్థులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పార్టీ సభ్యత్వం పొందిన ప్రతిఒక్కరికి రూ.5 లక్షల భీమా : మంత్రి ఆనం

- టీడీపీ నేత మెట్టుకూరికి పార్టీ శాశ్వత సభ్యత్వం
- ప్రతిఒక్కరూ పార్టీ సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనాలని పిలుపు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** అభివృద్ధి కార్యక్రమాలతోపాటు తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడిన ప్రతిఒక్క కార్యకర్త సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న ట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. సోమవారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు పట్టణ నేతలతో మంత్రి సమావేశమ య్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పైలేట్ ప్రాజె క్టుగా ఐదు నియోజకవర్గాలను సభ్యత్వ నమోదుకు ముఖ్యమంత్రి ఎంపిక చేసి అబ్జర్వర్లను నియమించారని, అందులో మన ఆత్మకూరు నియోజక వర్గం ఎంపిక కావడం మనందరికి గర్వకారణంగా మంత్రి చెప్పారు. ప్రతి ఒక్క కార్యకర్త కూడా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని, పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సభ్యత్వం పొందిన ప్రతిఒక్కరికి రూ. 5లక్షల వరకు బీమా సౌకర్యాన్ని పార్టీ కల్పిస్తున్న ట్లు మంత్రి చెప్పారు. పార్టీలో ఏ చిన్న పదవి పొందాలన్నా సభ్యత్వం తప్పని సరిగా ఉండాలన్నారు. అన్ని మండలాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సభ్య త్వాన్ని పూర్తి చేస్తామని మంత్రి చెప్పారు. అనంతరం టీడీపీ నేత మెట్టు కూరు ధనుంజయ రెడ్డి పార్టీ జీవితకాల సభ్యత్వానికి రూ లక్ష రూపాయలు చెల్లించగా, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతుల మీదుగా మెట్టుకూరు ధనుంజయ రెడ్డికి తెలుగుదేశం పార్టీ జీవితకాల శాశ్వత సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ పరిశీలకులు సుఖవాసి శ్రీనివాస్, సభ్యత్వ నమోదు పరిశీలకులు కార్తీక్, స్థానిక నాయకులు బొల్లినేని గిరినాయుడు, ఆత్మకూరు పట్టణ నాయకులు పాల్గొన్నారు.

# మర్రిపాడులో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలు మేరకు మండల కేంద్రమైన మర్రిపాడులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే పునాది అన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించే విధంగా కార్యకర్తలే ప్రాధాన్యత వహించాలన్నారు. పార్టీ సభ్యత్వంలో మర్రిపాడు మండలాన్ని నియోజకవర్గంలోనే అగ్రగామిగా నిలపాలని సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి అవసరమని తెలియజేశారు. అనంతరం సభ్యత్వానికి సంబంధించిన విధి విధానాలను వివరించారు. మండలంలోని అన్ని గ్రామాలలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించేందుకు మండల టీడీపీ కన్వీనర్ ఆరికట్ల జనార్దన్ నాయుడు, మాజీ మండల కన్వీనర్ శాఖమూరి నారాయణలు ప్రణాళిక సిద్ధం చేసుకొని ముందుకు వెళ్ళనున్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం మాజీ సొసైటీ ప్రెసిడెంట్



ఎర్రమల చెన్నారెడ్డి, చాబోలు సర్పంచ్ పుట్టం శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు ఎలగాల వెంకటేశ్వర్లు, పావులూరి వెంకట్రామయ్య, పెగళ్ళపాడు మాజీ సర్పంచ్ శేషం హజరత్ బాబు, చంద్రబాబు, గుర్రం తిరుపాలు తదితర టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాగునీరు విడుదల చేసే సమయం ఆసన్నమైంది

## పంట కాలువలలో గుర్రపు డెక్కను సిల్ట్‌ను పరిశీలించిన బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలో వరి నాట్లు వేసుకొనేందుకు సాగునీరు విడుదల చేసే సమయం ఆసన్నమైంది. అయితే పంట కాలువలు అన్ని గుర్రపుడెక్కతో మట్టితో కాలువలు నిండి ఉన్నాయి. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న ఇంతవరకు గుర్రపు డెక్క సిల్టు తొలగించే పనులు ప్రభుత్వం ప్రారంభించలేదు. త్వరలో ఐఏబి సమావేశం జరుగునుంది సోమశిల నుండి నీరు విడుదల చేసిన తర్వాత గుర్రపు డెక్క తొలగించే పనులకు అంతరాయం ఏర్పడుతుంది చివరి ఆయకట్టుకు నీరందే పరిస్థితులు ఉండవు జాఫర్ సాహెబ్ కెనాల్, సర్వేపల్లి కాలువ, కృష్ణపట్నం కాలువ, వల్లూరు కాలువ, కనుపూరు కాలువ, సదరన్ ఛానెల్, ఈస్ట్రాన్ ఛానల్‌లలో ఈ పూడిక తీత పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో పైడిమాని ఆదినారాయణ, రత్నం నాయుడు, పొట్టి శివ కుమార్, సుజన, నారాయణ రావు పాల్గొన్నారు.



# సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** బ్రహ్మదేవం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సిమెంట్ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగింది. సోమవారం తిరుపతి పార్లమెంటు టీడీపీ గౌరవ అధ్యక్షులు కొత్తపల్లి రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రహ్మదేవం పంచాయతీలో పలుచోట్ల ప్రజలకు అవసరమైన సిమెంటు రోడ్లు నిర్మాణానికి భూమి పూజ చేశామని మౌలిక సదుపాయాలు కూడా కల్పిస్తామని కొత్తపల్లి రమేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆలూరు విష్ణువర్ధన రావు గ్రామ సర్పంచ్ ఏందోటి సుధాకర్ సచివాలయం కార్యదర్శి లెనిన్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నందవరం శివాలయంలో చోరీకి యత్నం



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని నందవరం గ్రామంలో ఉన్నటువంటి శివాలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీయత్నానికి పాల్పడ్డారు. ఆ దుండగులు ఆలయంలోని హుండీని పగలగొట్టేందుకు ప్రయత్నించగా వీలు లేకుండా పోవడంతో అక్కడే వదిలేసి వెళ్లారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమా చారం అందించడంతో స్థానిక ఎస్ఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గ్రామస్తులతో కలిసి పరిశీలించగా ఎటువంటి వస్తువులు గాని, నగదు కానీ అపహరణకు గురి కాలేదని తెలిపారు. అయితే గతంలో కూడా ఈ గ్రామంలోని మరికొన్ని ఆలయాల్లో చోరీ జర గడం జరిగింది. ఒకసారి కూడా ఆ దుండగులు దొరికిన పాపాన పోలే దని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోకి గుర్తు తెలియని దుండ గులు ప్రవేశిస్తుండడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

# ఎమ్మెల్సీ పర్వతరెడ్డిని కలిసిన నాయకులు



**నెల్లూరు/నవాబుపేట, మేజర్‌న్యూస్ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని వైసీపీ మైనారిటీ నాయకులు యస్దాని తదితరులు కలిశారు. నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని వైసిపి నాయకులు యస్దాని ఆధ్వర్యంలో స్థానిక వైసీపీ నాయకులు కలిసి వైస్సార్సీపీ పార్టీ కోసం పని చేస్తామని తెలియచేసారు. ఈ సందర్భంగా పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వారితో స్థానిక అంశాలను చర్చించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా కలిసికట్టుగా పని చేద్దామని వారితో చంద్ర శేఖర్ రెడ్డి తెలిపారు. కార్యకర్తలకు ఏ అవసరమున్నా కలిసి పనిచేస్తామని చంద్ర శేఖర్ రెడ్డి తెలియజేశారు. ఇందులో వైసీపీ సీనియర్ నాయకులు రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షులు హంజా హుస్సేనీ పాల్గొన్నారు.

# ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి పట్టుదలతో పనిచేస్తున్నా

- గడిచిన ఐదేళ్లలో ఆత్మకూరులో అభివృద్ధి ఊసే లేదు
- మళ్లీ ఆత్మకూరు అభివృద్ధిని పట్టాలెక్కించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా
- ఆత్మకూరు అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలి
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి పట్టుదలతో పనిచేస్తున్నానని రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఉదయం నెల్లూరు నగరంలోని క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని నాయకులతో మున్సిపాలిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆత్మకూరు పట్టణంలో గతంలో తన హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప గత ప్రభుత్వం చేసిందేమి లేదని, మళ్లీ ఆత్మకూరు అభివృద్ధిని పట్టాలెక్కించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు మంత్రి అన్నారు. ఆత్మకూరు పట్టణాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు స్థానిక నాయకులు, ప్రజలు భాగస్వామ్యం కావాలని మంత్రి పిలుపునిచ్చారు. మున్సిపాలిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై యాక్షన్ ప్లాన్ తయారుచేస్తున్నామని పేర్కొన్న మంత్రి, ఒక్కొక్కటిగా పూర్తి చేస్తామని చెప్పారు. పట్టణంలో ఎల్ఈడి లైట్లు, అన్నివార్డుల్లో సీసీ రోడ్లు, సైడు కాలువల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, ప్రాధాన్యతక్రమంలో పనులు చేపడతామన్నారు. 9కోట్లతో తాగునీటి స్కీంను పనులు చేపట్టామని, దీంతో ఆత్మకూరు ప్రజల దాహార్తి శాశ్వతంగా తీరనుందన్నారు. ఆత్మకూరు సమీపంలోని టిడ్కో ఇళ్లల్లో అన్ని సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి చెప్పారు. ఆత్మకూరు పట్టణంలో పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, అన్ని వార్డుల్లో ఆకస్మికంగా తనిఖీలు చేస్తానని, ఎవరైనా పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం చూపితే వెంటనే సస్పెండ్ చేస్తామన్నారు. త్వరలో ఆత్మకూరులో బీసీ బాలికల రెసిడెన్షియల్ కళాశాలను, ఆర్ అండ్ బి అతిథి గృహాలను ఆయాశాఖల మంత్రులతో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. తహశీల్దారు కార్యాలయం కూడా పూర్తికావచ్చిందని, త్వరలోనే నూతన షాదీ మంజిల్ నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. పట్టణంలోని అన్ని రోడ్లను ఆధునీకరిస్తామన్నారు. పార్కుల అభివృద్ధి, ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. ఆత్మకూరు పట్టణంలో చేపట్టనున్న అన్ని అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక నాయకులందరూ భాగస్వామ్యమై తమవంతు సహకారం అందించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ పరిశీలకులు సుఖవాసి శ్రీనివాస్, సభ్యత్వ నమోదు పరిశీలకులు కార్తీక్, నాయకులు బొల్లినేని గిరినాయుడు, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, ఆత్మకూరు పట్టణ నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, మున్సిపల్ చైర్మన్ వెంకట రమణమ్మ, వైస్ చైర్మన్ సర్దార్, టీడీపీ నాయకులు బుజ్జిరెడ్డి, వెంకటేశ్వర్లు నాయుడు, వెంకట రమణారెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# జేజే యాక్ట్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** మహిళ శిశు సంక్షేమ శాఖ సమగ్ర బాలల సంరక్షణ పథకం ఆధ్వర్యంలో నడుప బడుతున్న బాలల వసతి గృహాల మేనేజర్స్ అందరికి జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిణి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోమ్స్ అన్ని జేజే యాక్ట్ 2015 చట్టం కిందకు వస్తాయి కావున అందరూ చట్టంకు సంబంధించి పనిచేయాలి హోమ్స్‌లో మానేజ్మెంట్ కమిటీ, చిల్డ్రన్స్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలి, చిల్డ్రన్ హోమ్, జేజే యాక్ట్‌కు తగ్గ విధంగా రికార్డ్స్ అన్నింటిని నిర్వహించుకోవాలని బిల్డింగ్ రేపైర్స్ ఉంటే వెంటనే మా దృష్టికి తీసుకొని రావాలి దాని వలన పిల్లలు ఇబ్బంది పడకూడదని హోమ్ ఎప్పుడు హైజీన్‌గా ఉండేలా చూసుకోవాలి 18 సంవత్సరాల పిల్లల్ని ఎవరు లేరి వారిని లిస్ట్ మాకు తెలియజేయాలని పిల్లలకు వాన కాలం కావున వారి ఆరోగ్యం కోసం విష జ్వరాలు సోఖ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. అనంతరం డీసీపీవో బి.సురేష్ మాట్లాడుతూ.. జేజే యాక్ట్ 2015 బుక్‌ను అందరూ హోమ్‌లోని లైబ్రరీలో ఉండేలా చూసుకొని యాక్ట్ ప్రకారం హోమ్ వారు ఏమి చేయాలి పిల్లలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించాలి అనేది చూసుకొని యాక్ట్ అమలు చేసే విధానంలో అందరూ కలిసి కృషిచేయాలి దానికి మా యొక్క సహకారం మీకు యెల్ల వేళల ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుమలత, ఐసిపిఒ పి.మంజుల, సుజాత, అఖిల హోమ్ మేనేజర్స్ పాల్గొన్నారు.

## ఆత్మకూరు సీఐని కలిసిన జిల్లా విజిలెన్స్ సభ్యులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, మర్రిపాడు ఎస్ఐ కాసుల శ్రీనివాసరావును సోమవారం ఆత్మకూరు పోలీస్ కార్యాలయంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు శేషం సుదర్శన్ కొప్పాల రఘు, హ్యూమన్ రైట్స్ జిల్లా మహిళా సెక్రెటరీ పి.ఇందిరమ్మ, జాయింట్ సెక్రెటరీ ఎస్.కె తాహెరా ఓ కేసుకు సంబంధించిన విషయంలో కలిశారు. ఈ సందర్భంగా కేసుకు సంబంధించిన పలు అంశాలపై చర్చించడం జరిగింది. తగు చర్యలు తీసుకోవాలని వారు ఎస్ఐలను కోరారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విద్యుత్ మరమ్మత్తులు




**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** వరికుంటపాడు మండలంలోని తూర్పు రొంపిదొడ్ల గ్రామ పంచాయతీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నీటి సమస్య విద్యుత్ వెలుగులు, మరమ్మతులు చేశారు. గత కొద్ది రోజులుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విద్యుత్ మరమ్మతులు గురవడంతో స్థానిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు మిరియా రోజా స్థానిక తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మారినేని రామకృష్ణ దృష్టికి తీసుకురావడంతో వెంటనే ఆయన స్పందించి స్థానిక పంచాయతీ సర్పంచ్ కూండ్ల నాగేశ్వరి లక్ష్మీ నరసయ్య దృష్టికి తీసుకువెళ్ళడం వెంటనే వారు స్పందించి నూతన పరికరాలను తెప్పించి సిబ్బంది ద్వారా విద్యుత్ వెలుగులు నీటి సమస్య పరిష్కరించారు. ఆరోగ్య కేంద్రంలో విద్యుత్ మరమ్మత్తులు గురవడంతో రాత్రి వేళల్లో ఆరోగ్య కేంద్రం ఆవరణలో పాములు తేళ్లు వస్తుండడంతో వచ్చినటువంటి ఆరోగ్య బాధితులు అలాగే తాము తీవ్రంగా భయాందోళన గురవుతున్నామని స్థానికులు అన్నారు. యువ నాయకులు మారినేని రామకృష్ణ, చల్లా నాగయ్య బ్రహ్మయ్య తదితరులు ఆధ్వర్యంలో దగ్గరుండి సిబ్బందితో కలిసి మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించారు. ఆరోగ్య కేంద్రంలో సమస్యను పరిష్కరించిన కూండ్ల నాగేశ్వరి లక్ష్మీనరసయ్యకు, యువ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఘనంగా అమరవీరుల సంస్కరణ దినోత్సవం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఉదయగిరిలో ఎస్ఐ కే.ఇంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పోలీసుల సంస్కరణ దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అమరులైన పోలీసులకు నివాళులర్పిస్తూ వారి చిత్రపటాలకు పూలమాల వేశారు. అనంతరం పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి అమరవీరుల త్యాగాలను వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఇంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రాణాలను సైతం లెక్కచేయక ప్రజల కోసం మేము ఉన్నాము అంటూ తమ ప్రాణాలు సైతం త్యాగాలు చేసి ఎంతోమంది ప్రాణాలను కోల్పోతున్నారన్నారు ఎందరో పోలీసులు తమ కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ దేశం కోసం తమ ప్రాణాలను అర్పిస్తున్నారని వారి సేవలు మరువలేనివి తెలిపారు, వారు చేసిన సేవలను ప్రతి సంవత్సరం గుర్తు చేసుకుంటూ భావితరాలకు వారు స్ఫూర్తిగా నిలుస్తారని తెలిపారు. అనంతరం గ్రామంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించిపంచాయితీ బస్టాండ్‌లో మానవహారం ఏ ర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




## పాఠశాలలో విద్యాకమిటీ సమావేశం



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపూర్ మండలం సైదాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు హెచ్ఎం వాసుదేవా కుమార్ విద్యా కమిటీ మీటింగ్‌ను విద్యా కమిటీ సభ్యులతో ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ మెంబర్స్ అందరూ కూడా పాఠశాల యొక్క పరిసరాలను పరిశీలించి పాఠశాలకు అవసరమైన ప్రధాన అంశాల గురించి చర్చించారు. అంతేకాకుండా పాఠశాల ఆవరణంలో పరిశుభ్రత గురించి పాఠశాల మరుగుదొడ్లు గురించి క్లీన్‌గా ఉంచాలని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నీరజ తెలిపారు. అంతేకాకుండా పాఠశాల యొక్క మధ్యాహ్న భోజనం కూడా విద్యా కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు పరిశీలించారు.

# ఎన్నికలప్పుడే రాజకీయాలు చేయండి



- ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా విధులు నిర్వహించండి
- ప్రజావసరాల తీర్చడం మీ కర్తవ్యం
- సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేర్చడం మీ బాధ్యత
- కోవూరు రైతాంగ అవసరాల కోసం వెంటనే నీళ్లు విడుదల చేయండి
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులతో సమన్వయం చేసుకుంటూ అధికారులు పని చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. కోవూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రజా సమస్యలు ఆలకించారు. వివిధ శాఖలకు సంబంధిన మండల స్థాయి అధికారులు తమ శాఖల పరిధిలో జరిగే కార్యకలాపాలకు సంబంధించి వివరాలను సభలో ప్రస్తావించారు. మినీ అసెంబ్లీ సమావేశాలను తలపించేలా జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలు సంస్థాగత సమస్యలపై స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులను ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో గృహ నిర్మాణాలలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమాధానం చెప్పాలని లేగుంటపాడు సర్పంచ్ జెట్టి రాజ గోపాల్ రెడ్డి, హౌసింగ్ ఏఈ పై ప్రశ్నల వర్షం కురిపించారు. గుంతలమయమై వున్న రోడ్ల దుస్థితి, ఆక్రమణలు, అనధికార విద్యుత్ కోతలపై సమాధానం చెప్పాలని సంబంధిత అధికారులు సమాధానం చెప్పాలని సభ్యులు పట్టు పట్టారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి జోక్యం చేసుకొని సభ్యులను శాంతింప చేశారు. మండల సాగునీటి రంగ పురోగతి వివరిస్తూ నవంబర్ 1వ తేదీన జరిగే జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం అనంతరం కలెక్టర్ ఆదేశాల తరువాత రైతాంగానికి నీళ్లు విడుదల చేస్తామన్న ఇరిగేషన్ ఎఇ ప్రకటించడంతో సభ్యులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అవసరమైతే తాను కలెక్టర్‌తో మాట్లాడుతానని కోవూరు నియోజకవర్గ పరిధి లోని 12,500 ఎకరాలకు ముందుగా సాగునీరు విడుదల చేయాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కీలకమైన రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఆరోగ్యం, విద్య, ఇరిగేషన్, విద్యుత్, వ్యవసాయం తదితర శాఖలకు చెందిన అధికారులలో చాలా మంది బదిలీలలో భాగంగా కొత్తగా వచ్చి వున్నారని స్థానిక పరిస్థితులపై అవగాహన పెంచుకొని స్థానిక నాయకులతో సమన్వయం చేసుకొని పని చేయాలని సూచించారు. ప్రజలతో మమేకమై ప్రభుత్వం గ్రామీణ ప్రాంత రైతులు సబ్సిడీలు, పేదలకు లబ్ది చేకూర్చే పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు చేరువై వాటి ద్వారా ప్రజలకు మేలు జరిగేలా కృషి చేయండి. మీ కేమైనా సమస్యలుంటే నా దృష్టికి తీసుకురండి. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి ప్రజలకు చేర్చే దిశగా పని విధి నిర్వహణలో మెరుగైన పనితీరు కల్పించాలని కోరారు. రాజకీయాలనేవి ఎన్నికల వరకేనని ప్రజలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలలో అధికారులతో సహకరించాలని వైసిపికి చెందిన ప్రజా ప్రతినిధులకు హితవు పలికారు. మండల పరిషత్ అధ్యక్షురాలు తుమ్మల పార్వతి అధ్యక్షతన జరిగిన ఈ సమా వేశంలో వైస్ ఎంపిపి సాయిలక్ష్మి, జెడ్పిటిసి శ్రీలత, తహసీల్దార్ నిర్మలానంద బాబా, ఎంపిడిఓ శ్రీహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టిడ్కో గృహాలపై ద్రుష్టి సారించండి : లబ్దిదారులు

**నెల్లూరు టౌన్, మేజర్‌న్యూస్ :** దాదాపు ఎనిమిది సంవత్సరాల క్రిందట అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నగరంలోని ఇల్లు లేని పేదలకు ఇళ్ళు ఇవ్వాలని సంకల్పంతో అందరికి ఇళ్ళు పథకంలో నెల్లూరులోని వివిధ ప్రాంతాల్లో బాడుగ ఇళ్లలో నివసించే వారికీ నెల్లూరుకు సమీపంలోని అల్లిపురంలో టిడ్కో సంస్థ ద్వారా ఇళ్లను 300 చదరపు గజాలలో అప్పట్లో శరవేగంగా ఇళ్ల నిర్మాణం చేపట్టింది. దాదాపు 80శాతం పనులు పూర్తి చేసింది. 2019 నాటికీ తర్వాత ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడం తెలిసిందే. అదిగో ఇదిగో అంటూ ఐదేళ్లకాలం పూర్తి జరిగిపోయింది. గడచిన ఫిబ్రవరిలో హడావుడిగా పట్టాలు పంపిణి చేసి తాళ్లలు ఇస్తామని కొందరికి ఇళ్ల తాళ్లలు ఇచ్చారు. అయితే చాలా గృహాలకు కరెంటు మంచి నీటి సౌకర్యం లేదు. దింతో ఇళ్లలో చేరేందకు లభిదారుల ముందుకు రావడం లేదు. అల్లిపురంలోని టిడ్కో కాలనీ ప్రారంభంలో కొందరికి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మిగతా ఇళ్లకు మంచినీరు. కరెంటు సౌకర్యం ఏర్పాటు కాలేదు. ఈ క్రమంలో ఇళ్లలో ఎవరు చేరలేదు. తమకు ఇళ్ళు వస్తుందని ఆశ తో ఉన్న కొందరు లభిదారులు ఇల్లు పొందకుండానే మృతి చెందారు. మిగతా వారు ఆశతో ఇల్లు ఇస్తారనే ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇంత పెద్ద ఇళ్ల సముదాయం నిర్మించి కూడా ఇళ్లకు అన్ని సౌకర్యాలు కల్పిస్తే పేద ప్రజలకు బాడుగ బాధ తప్పుతుందని గృహ లబ్దిదారులు అంటున్నారు.



### మంత్రి నారాయణ ద్రుష్టి సారిస్తే మేలు..

గతంలో ఇళ్ల సముదాయంకు ప్రత్యేక శ్రద్ద చూపిన నాటి మంత్రి నారాయణ ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కీలక మంత్రిగా ఉన్న పొంగురు నారాయణ కాస్త ద్రుష్టి సారించి 80శాతం పూర్తి అయిన ఇళ్లకు పెండింగ్‌లో ఉన్న విద్యుత్ మంచి నీరు వీధి లైట్లు ఏర్పాటు చేస్తే చాలా కుటుంబాలు గృహ ప్రవేశాలు చేస్తామని లభిదారులు అంటున్నారు. మంత్రి నారాయణ కాస్త ద్రుష్టి సారిస్తే మేలు పేదలకు ఇళ్ళు అందుబాటులోకి వస్తాయి.

# కార్తీక మాస లక్ష దీపోత్సవానికి అంకురార్పణ

### భూమిపూజ చేసిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఏటా కార్తిక మాసంలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతుల సహాయ సహకారాలతో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్తీకమాస లక్ష దీపోత్సవానికి సోమవారం అంకురార్పణ కార్యక్రమం జరిగింది. సోమవారం వీఆర్‌సీ మైదానంలో ఏర్పాటు చేసిన భూమిపూజ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే, వీపీఆర్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్తీక మాస లక్ష దీపోత్సవ కమిటీ సభ్యులు కంజర్ల భాస్కర్ శర్మ, విజయసారధి, సునీల్ కుమార్, అర్చకులు పవన్‌స్వామితో కలిసి భూమిపూజ నిర్వహించారు. అనంతరం గుంజ ప్రతిష్టాపన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాగేంద్ర కుమార్, తిరుపాల్‌రెడ్డి, రాము, వెంకటేశ్వర్లు రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, చలమయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ ఏడు కార్తీకమాస లక్ష దీపోత్సవ కార్యక్రమం నెల్లూరు నగరంలోని వీఆర్‌సీ మైదానంలో నవంబర్ 8, 9, 10వ తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. కార్తీక మాస లక్ష దీపోత్సవ కార్యక్రమానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కమిటీ సభ్యులకు సూచించారు. ఆద్యంతం భక్తిపారవశ్యం ఉప్పొంగేలా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. గతేడాది కన్నా మిన్నగా ఈ సంవత్సరం ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు వివరించారు.








# దోమలు బాబోయ్ దోమలు..



**నెల్లూరు/నవాబుపేట, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని 6వ డివిజన్ పరిధిలోని శెట్టి గుంట రోడ్డు నందుగల జాఫర్ సాహెబ్ పంట కలువ నేడు పూర్తిగా గురప్పు డెక్కతో నిండి పోయింది. నీరు ముందుకు కదలక నీరు నిలిచి పోయింది. దీని వల్లన దోమల సమస్య విపరీతంగా ఉందని స్థానికులు తెలిపారు. దోమల వలన జ్వరాలు తరచూ వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించి తక్షణమే ఈ కాలువలో వ్యర్థలు గుర్రప్పు డెక్కను తొలగించాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేశారు. దోమల బారి నుండి ప్రజలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో 6వ డివిజన్ స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలీసు అమర వీరులకు జోహార్లు

- మేయర్ స్రవంతి జయవర్ధన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన పోలీస్ అమరవీరుల దినోత్సవంలో నగర మేయర్ స్రవంతిజయవర్ధన్ సోమవారం పాల్గొని అమరవీరుల సంస్మరణ స్తూపం వద్ద ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా అమరవీరుల సంస్మరణ స్తూపం వద్ద ఘన నివాళి అర్పించడం జరిగిందని తెలియజేశారు. ఎండ, వాన, పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుటుంబంతో కలిసి జరుపుకునే పండగ - పబ్బాల్ని కూడా త్యాగించి, ప్రజల కోసం అహర్నిశలు పనిచేస్తూ, విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్కా చేయకుండా తమ బాధ్యత నిర్వహించడంలో అమరులైన పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయమని అన్నారు.

# మల్లూరులో పల్లె పండుగ కార్యక్రమం

## 50 మీటర్లు సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మల్లూరు గ్రామపంచాయతీలో సోమవారం అధికారపార్టీ నాయకులు పల్లె పండుగ కార్యక్రమాన్ని ఘనంగా చేశారు. కన్నేటమ్మ ఆలయం వద్దకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టే విధంగా శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 50 మీటర్ల మేరకు రెండు లక్షల రూపాయల అంచనాలతో రోడ్డు నిర్మాణం చేస్తారు. అధికార పార్టీ నాయకులు నీళ్ళచిన్నారావు, నీళ్ళ రాంబాబులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పంచాయతీ కార్యదర్శి సాయి కృష్ణ, ఇంజనీరింగ్ సహాయకులు గ్రామస్తులు పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నాయకులు మాట్లాడారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున యాదవ్ సహకారంతో రోడ్డు నిర్మాణం చేస్తామన్నారు. భక్తులకు సౌకర్యంగా ఉండే విధంగా అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలియజేశారు. గ్రామస్తులు కూడా సహకారం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వీఎస్‌యూ క్రీడా కారులను అభినందించిన ఉపకులపతి



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** కాకుటూరు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని పరిపాలన భవనంలో ఉపకులపతి ఆచార్య ఎస్.విజయ భాస్కర రావు, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత ఇంటర్-కాలేజియేట్ గేమ్స్ టోర్నమెంట్‌లో మేన్ గేమ్స్ టెన్నిస్ సింగిల్స్, డబుల్స్ కేటగిరీలో రన్నర్లుగా నిలిచిన పి.హేమంజనేయులు (మెరైన్ బయాలజీ విభాగం), ఎ.శ్రీనివాసరావు (కెమిస్ట్రీ విభాగం)లను అభినందించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య ఎస్.విజయ భాస్కర రావు మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల మానసిక, శారీరక అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని, క్రీడల్లో విజయం సాధించడం మాత్రమేకాక, క్రమశిక్షణ, పట్టుదల, టీమ్ వర్క్ వంటి విలువలను నేర్పుతాయని పేర్కొన్నారు. అంతరం రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, సమష్టి విధానాన్ని మెరుగుపరుస్తాయని, రన్నర్‌గా నిలిచిన విద్యార్థులు తమదైన గుర్తింపు సాధించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వీఎస్‌యూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రెటరీ డాక్టర్ సిహెచ్. వెంకటరయులు, విశ్వవిద్యాలయ పీడీ డాక్టర్ పి.ప్రవీణ్ కుమార్ విజేతలకు తమ శుభా కాంక్షలు తెలియజేశారు.

# అనంతసాగరంలో ప్రజా విజ్ఞపనల స్వీకరణ

- 28న హాజరుకానున్న మంత్రి ఆనం
- అధికారులతో చర్చించిన మంత్రి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండల కేంద్రంలో ఈనెల 28న సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వయంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాల్గొననున్నారు. సోమవారం సాయంత్రం నెల్లూరు నగరంలోని క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు డిఎస్పి, ఆర్డిఓ, మున్సిపల్ కమిషనర్, పోలీస్ అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని, ఈ మేరకు తాను స్వయంగా పాల్గొని క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి ఆనం తెలిపారు. తొలుత ఈనెల 28న అనంత సాగరంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొంటానని పేర్కొన్నారు. అనంతరం, ప్రతి సోమవారం ఒక్కొక్క మండల కేంద్రంలో నిర్వహించే మండల స్థాయి కార్యక్రమంలో పాల్గొంటానని చెప్పారు. అధికారులందరూ కూడా పూర్తి సమాచారంతో ఈ కార్యక్రమానికి హాజరుకావాలని మంత్రి ఆదేశించారు. తక్షణమే సమస్యలను పరిష్కరించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశంగా అధికారులకు వివరించిన మంత్రి, ఇందుకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని ఆదేశించారు. ఆత్మకూరు నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి, మరియు పలు అంశాలపై మంత్రి అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో ఆత్మకూరు ఆర్డీవో పావని, డీఎస్పీ వేణుగోపాల్, కమిషనర్ గంగా ప్రసాద్, ఆత్మకూరు, సంగం సీఐలు, ఆత్మకూరు నియోజకవర్గ అన్ని మండలాల ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి నిర్మాణం కోసం 11వేల కోట్లు రుణం మంజూరు



**నెల్లూరు/నవాబుపేట, మేజర్‌న్యూస్ :** హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ హడ్కోఅధికారులతో మంత్రి నారాయణ, మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ సోమవారం ఢిల్లీలోహడ్కో సీఎండీ సంజయ్ కుల్ శ్రేష్ఠ,హడ్కో విజయవాడ రీజనల్ చీఫ్ బీఎస్ఎన్ మూర్తి అమరావతి నిర్మాణం, నెల్లూరులో అభివృద్ధి కార్యక్రమాలకు హడ్కో నుంచి ఋణసదుపాయం సమావేశం జరిగింది. అమరావతి నిర్మాణంలో ప్రభుత్వ ఆలోచన విధానాన్ని హడ్కో అధికారులకు వివరించిన మంత్రి అమరావతి నిర్మాణం కోసం ఏపీ సీఆర్డీయేకు 11వేల కోట్ల రుణం మంజూరుకు హామీ ఇచ్చారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పలు అభివృద్ధి పనులకు గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పెండింగ్‌లో ఉన్న 165 కోట్ల రుణం విడుదలకు హడ్కో అంగీకరించిందన్నారు. వారం రోజుల్లో లోన్ ప్రక్రియ ప్రారంభిస్తామని వెల్లడించారు.

# తెల్లరాయి ట్రాక్టర్లలపై దాడులు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలంలో అక్ర మంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సైదాపురం ఎస్ఐ సీజ్ చేయడం జరిగింది. సైదా పురంలోని లింగసముద్రం దగ్గర ఒక ట్రాక్టర్ సైదాపురం మండల పరిధిలోని రాపూర్ క్రాస్ రోడ్ వద్ద మరో ట్రాక్టర్‌ను ఆదివారం సీజ్ చేయడం జరిగిందని స్థానిక ఎస్ఐ తెలియజేశారు.

## మునగపాడు తోచం రోడ్డు మూసివేత



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలం మునగాపాడు నుండి తోచాం పోవు దారిని సర్వే నెంబర్ 29లో గల రోడ్డును టీడీపీ నేతలు మూసివేశారు అంటూ మునగపాడు గ్రామ పంచా యతీకి చెందిన మాలకొండరెడ్డి స్థానిక తహసిల్దార్‌కి ఫిర్యాదు చేశారు.

## సీజనల్ వ్యాధులపై సోమశిలలో కళాజాత



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలం సోమశిలలో సోమవారం డయేరియా, మలేరియా, డెంగ్యూ ఇతర సీజనల్ వ్యాధులపై పంచాయతీ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. జానపద కళావేదిక చక్రపాణి బృందం కార్యక్రమం నిర్వహించారు. నివాస పరిసరాలు, పర్యా వరణ పరిశుభ్రత పాటించాలని, ప్రాణాంతక వ్యాధులను అరికట్టలం టూ నృత్యాలతో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఘాట్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఆందోళన




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** అసంపూర్తిగా ఉన్న ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని సోమవారం ఆర్ అండ్ బీ కార్యాలయం ఎదుట సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు ఘాట్ రోడ్డు కోతలకు గురై వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దశాబ్దాల కాలం నుంచి రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో సుమారు 12 కొండకింద గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారన్నారు. దీనికితోడు ఇటీవల కురిసిన వర్షాలకు అన్నంపల్లి వద్ద దున్నపోతుల వాగుపై నిర్మించిన వంతెన పూర్తిగా దెబ్బతినడంతో కొండకింద గ్రామాలకు బస్సులు రాక ప్రజలు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రాణాలు పోతేగాని పాలకులు, అధికారులు రహదారి చేపట్టేలా లేరని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు చెప్పుకొనేందుకు ఎప్పుడు కార్యాలయానికి వచ్చినా ఆర్ అండ్ బీ అధికారులు అందుబాటులో ఉండరని, వేలకువేలు జీతాలు తీసుకుంటూ విధులకు దుమ్మా ఏలా కొడుతున్నారో ఉన్నతాధికారులకే తెలియాలన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, ప్రజాసం ఘాల నాయకులు గుజ్జుల మల్లికార్జున, లక్ష్మీనారాయణ, కోడె రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.